# రామశేషారెడ్డిగారి ఇంద్రభవనం

**రామచంద్రపురం వెళ్ళే దారిలో ఎడం పక్కనున్న పిల్లకాలవ దాటాకా పొలాల మధ్యలో ఉంది వెంపర్తమ్మగుడి. ఆ గుడి దాటి బాగా దూరమెళ్తే కనిపించేవన్నీ రామశేషారెడ్డిగారి పొలాలే. ఒకెకరం రెండెకరాలుగాదు ఏకంగా వందెకరాల ఏకదొడ్డి. ఆ వందెకరాలకి మధ్యలో ఒక ఎకరం నేలలో గెస్టవుసు. అలాంటి గెస్టవుసు మా ప్రాంతాల్లో ఎక్కడా చూసి ఎరగం. దాన్ని కట్టడానికి రామచంద్రపురంలో ప్లీడరు బుద్ధవరపు మహదేవుడిగారబ్బాయి మెడ్రాసులో పెద్దపెద్ద ఇళ్ళకి డిజైన్లు గీస్తున్న ఆర్కిటెక్టు బి.యస్. మూర్తి (సతీష్ అని ఇంకో పేరుందాయనకి) గారు గీసిచ్చేరట డిజైను. భూగర్భంలో ఇంకా గదులున్నాయంట ఆ గెస్టహౌస్‌కి. బయటంతా పావురాలూ, చిలకలూ, గిన్నికోళ్ళు, యూమోకోళ్ళు టర్కీకోళ్ళతో పాటు ఒక నెమళ్ళ జంటకూడా ఉంది.**

ఇంక అక్కడ పెరిగే మొక్కల విషయానికొస్తే మేమెప్పుడూ ఎరగని రకరకాల మొక్కలున్నాయి. వాటిల్లో ఎర్రచందనం మొక్కలు, దాల్చిన చెక్క మొక్కలు, ఏలక్కాయలు కాసే మొక్కలు లవంగం మొక్కలు మిరియం పాదులు పైన్ చెట్లూ ఇలా చెప్పడానికే చాలాసేపు పట్టేటన్ని మొక్కలు.

రామశేషారెడ్డి పొగరేంటంటే తన దగ్గరున్నవి ఇంకెక్కడా ఉండకూడదు. పొరపాటున ఇంకోచోట ఉంటే వెంటనే మార్చేస్తాడు దాన్ని.

జక్కం వీరన్నంత కాదుగానీ యానాం అవతల నీలపల్లిలో కూడా చాలా మంచి పనిమంతులయిన వడ్రంగి మేస్త్రులున్నారంట. వాళ్ళందరినీ పిలిపించి కొత్తరకం సవ్వారీ బండొకటి చేయించేడు.

చక్రాల ఆకులకి నెగిషీలు బండికి ఎడాపెడా కిర్సనాలు లాంతర్లు తగిలించేచోట చెక్కిన చిత్రమైన కణుపులు, అలాగే ఎద్దులు మోసే కావిడి చుట్టూ కూడా బొమ్మలు చెక్కించేడు. పూర్వమయితే లోపల ఒట్టి గట్టి పరిచి బిన్నీదుప్పటి కప్పేవారు. అలాక్కాకండా పూర్వం దివాన్లు కూర్చునే నేలబారు మంచం లాంటిది చేయించి దానిమీద పట్టు పరుపులేయించేడు.

అసలా కొత్త రకమైన సవ్వారీబండి ఝుల్‌ఝుల్ మని గజ్జెల చప్పుళ్ళతో ఊరి వీధుల్లోంచెళ్తుంటే ఒకటే సందడి. మేస్త్రి వీరాస్వామిగారయితే ''నాకు రాని అవిడియా ఈ శేషారెడ్డి కొచ్చింది శెబాష్'' అని చప్పట్లు కొట్టేసేడు. కాలవ దగ్గరున్న బ్రాహ్మలు వాడ్రేవు రత్నేశ్వర్రావుగారయితే భళ్ళున నవ్వేసి ''రామశేషారెడ్డి తక్కువవాడేం గాదు'' అని మెచ్చేసుకున్నాడు. ఈ వార్తలన్నీ బండి నడిపే పాలేళ్ళ ద్వారా రామశేషారెడ్డి చెవిన పడేవి. రాత్రి నిద్రపోయేటప్పుడు గుండెల మీద చెయ్యేసుకుని నేను నా దగ్గరున్నది ఈ పిర్కాలో

ఇంకెవడి దగ్గరా ఉండకూడదు అనుకునేవాడు.

అయితే,

అచ్చంగా అతని దగ్గరున్న సవ్వారీ బండిలాంటి బండే మా వూరికి ఆరుమైళ్ళ అవతల కుతుకులూర్లో నల్లమిల్లి వెంకారెడ్డిగారనే ఆయన పెడపర్తిలో వున్న రత్నం అనే ముండకోసం చేయించేడని తెల్సిన శేషారెడ్డి ప్రాణం జిల్లార్చుకుపోయింది. రాత్రికి రాత్రే తన సవ్వారీబండిని పుంతరేవులోకి తోసేసేడు. ద్రాక్షారం సంతలో అమ్మితే బోల్డు రేటొచ్చే ఎద్దులకి ఎలకలమందెట్టి చంపించేశాడు.

* * *


రామశేషారెడ్డికి రాజకీయంగా మాంచి పలుకుబడి ఉంది. ఆ మధ్య వాళ్ళమ్మాయికి పెళ్ళయితే ఇద్దరు మినిష్టర్లూ చాలా మంది ఎమ్మెల్యేలూ వచ్చేరు.

ఒక మినిష్టరుగారు ఏదో ప్రభుత్వం పని మీద ఒక వందమంది రాజకీయ నాయకుల్నేసుకుని కలకత్తా వెళ్తుంటే సామర్లకోట స్టేషన్లో రైలు ఆగిన ఆ పావుగంటలో చాలా రకాల వంటల్తో గొప్పగావిందు ఏర్పాటు చేసేడు.

కనీ వినీ ఎరగని ఆ విందుగురించి పేపర్లన్నీ చాలా గొప్పగా రాసినియ్యి. అప్పట్నుంచీ ఎక్కడన్నా విందు ఏర్పాటు జరిగితే ఫలానా పసలపూడిలో రామశేషారెడ్డిగారు సామర్లకోటస్టేషన్లో ఫలానా మినిష్టరుగారి కిచ్చిన విందులాగుండాలనేవారు.

* * *

అంత అందగత్తెని మా జిల్లాలోనే కాదు మాకటు పక్కున్న విశాఖపట్నం జిల్లాలో గానీ ఇటు పక్కున్న పచ్చిమగోదావరిజిల్లాలోగానీ





మేం చూసి ఎరగం.

శేషారెడ్డి ఎక్కడ ఏరి కొట్టుకొచ్చేడో తెలీదుగానీ పేరు వెంకటలక్ష్మట.

ఆ మనిషి పద్మినీ జాతిది. శరీరం సుతిమెత్తగా లేత తామర మొగ్గలాగుంది.

ఆ తామర పద్మం ఎంత మంచి వాసనతో ఉంటదో ఆనక ఆవిడ వదిలే రతీజలంకూడా అంత వాసనతో ఉంటది. చక్కని వాసన సుగంధ వాసన. కళ్ళు పాడేరు అడవుల్లో లేడి కళ్ళలాగ కూడా ఉంటాయి. ముక్కు అరకులోయలో సొలపచెట్టు పూమొగ్గలాగ, రొమ్ములు పరమశివుడి కిష్టమైన మారేడు పళ్ళులాగా ఉన్నాయి. వెంకటలక్ష్మిని గెస్ట్‌హౌస్‌లోనే ఉంచి సర్వరాజభోగాలు సమకూర్చేడు.

పోతే,

అచ్చం ఆ పిల్ల లాంటి పిల్లనే కూళ్ళచౌదరిగారు తీసుకొచ్చారని తెల్సి ఆఘమేఘాల మీదెళ్ళేడు శేషారెడ్డి.

అందరూ అనుకుంటున్నది నిజమే వెంకటలక్ష్మి ఎలాగుంటదో ఆ పిల్లకూడా అలాగే ఉండటంతో మతిపోయింది రామశేషారెడ్డికి. పేరుకూడా దగ్గరగానే ఉంది ఉదయలక్ష్మట.

రాత్రయింది. అప్పుడే స్నానం చేసి తెల్లటి గ్లాస్కోచీరా జాకెట్టూ వేసుకుని గెస్ట్‌హౌసు బయటికొచ్చింది

వెంకటలక్ష్మి.

ఆరోజు పౌర్ణమి. ఆకాశంలో చెంద్రుడు తుమ్మచెట్టు వెనక్కెళ్ళిపోయేడు. చుట్టూ ఉన్న వందలఎకరాల్లో గాలి చల్లగా వీస్తుంది.

గాలి దుమారంలా వచ్చిన రామశేషారెడ్డి ''కూళ్ళలో ఒకమ్మాయిని చూసేను. నువ్వెలాగుంటావో డిటో అలాగే ఉంది. ఏమాత్రం తేడా లేదు. పేరుకూడా దగ్గరగానే ఉంది ఉదయలక్ష్మట'' అన్నాడు.

''అయితే ఉదయలక్ష్మి అక్కడకొచ్చిందా?'' అంది విస్తుపోయిన వెంకటలక్ష్మి.

''నీకు తెల్సా ఉదయలక్ష్మి'' అడిగేడు రామశేషారెడ్డి.

''మేమిద్దరం కవల పిల్లలం. నాకు చెల్లెలది. బొబ్బిలి అవతల పల్లెటూరు మాది. మేం తూర్పువెలమలం'' అంది వెంకటలక్ష్మి.

ఆమెకి బాగా దగ్గరగా వచ్చిన రామశేషారెడ్డి ''నాగురించి నీకు తెల్సు కదా? నేనొకరకం చొక్కా వేసుకుంటే అదింకెవరూ వేసుకోకూడదు. వేసుకోడమే జరిగితే అదెంత ఖరీదు పెట్టి కొన్నదన్నా సరే లెక్క జెయ్యకండా వెంటనే విప్పి మా పాలేరు కిచ్చేస్తాను'' అన్నాడు.

''మీరేం మాటాడ్తున్నారో నాకర్థమవుతుంది'' అంది వెంకటలక్ష్మి.

''అవుతుంది కాబట్టి నీకేం కావాలో తీసేసుకుని ఉన్నఫళాన వెళ్ళిపోవాలి'' అన్నాడు.

''అది కాదండీ'' అంటా చాలా బతిమాలింది వెంకటలక్ష్మి.

ఏమాత్రం చలించలేదు రామశేషారెడ్డి.

ఇక చేసేది లేక కోటిపల్లి రేవులో దిగి అద్దరికెళ్ళిపోయింది వెంకటలక్ష్మి.

* * *

పాతకాలం నాటి రెండు మండువాల లోగిలి బాగా పాడయిపోయుంది. దాన్ని పడగొట్టి ఆ ప్రాంతంలో ఎవరూ కట్టని గొప్ప ఇల్లు కట్టాలనుకుని ఉభయగోదావరి జిల్లాల్లో ఉన్న గొప్ప మేస్త్రుల్లో గొప్పవాడికోసం వెదుకుతుంటే త్రిమూర్తులు అనే గొప్పమేస్త్రి పెద్దాపురంలో తగిలేడు.

అతన్ని పిలిపించి ''నేనో ఇంద్రభవనంలాంటి ఇల్లు కట్టుకోవాలనుకుంటున్నాను. అలాంటి ఇల్లు ఈ చుట్టుపక్కల ఎక్కడా ఉండటానికి లేదు. అర్థమైందా?'' అన్నాడు.

''అయిందండి... అయితే దానికి డిజైను గీసే చదువుకున్నోళ్ళు ఎవరైనా ఉన్నారాండీ?'' అడిగేడు త్రిమూర్తులు.

''మెడ్రాసులో ఉన్నారు మూర్తిగారనీ''.

''నాకు ఆరెవరూ వద్దండి...నేనే రకరకాల మోడల్స్ గీస్తాను. అందులో ఏది బాగుందో మీరు చెపితే ఆ ప్రకారంగా కట్టేద్దారి ఏమంటారు?'' అడిగేడు త్రిమూర్తులు.

''నువ్వు మోడల్సు గీశాకాగానీ చెప్పలేను'' అన్నాడు శేషారెడ్డి.

మర్నాటినించే గియ్యడం మొదలెట్టిన త్రిమూర్తులు నెల తిరక్కుండానే చాలా స్కెచ్చిలు గీసేడు.

వాటన్నిటినీ చూసి మతిపోయినట్టయిపోయిన రామశేషారెడ్డిగారు ఒక డిజైన్ సెలక్ట్ చేసుకున్నారు.

దాంతో,

పనులు మొదలైనాయి. పాడేరు అరకుల్లో కలపంతా చోడవరం డిపోలో వేలం వేస్తుంది గవర్నమెంటు. అక్కడ్నించి కలపా, రాజమండ్రి నించి ఇనుమూ గండ్రు ఇసకా తెప్పించేడు.

పునాదులు లేచినియ్యి.

కొన్నాళ్ళకి గోడలుకూడా లేచినియ్యి. పసుపు, కుంకాలు పూసిన ద్వారాలు నిలబెట్టేరు. పచ్చని మావిడాకు తోరణాలు గాలికి వూగుతున్నాయి. ఇల్లు ఒకరూపాన్ని దిద్దుకుంటుంది. పొద్దున్నుంచి సాయంత్రం దాకా అక్కడే కూర్చుని పనులు పురమాయిస్తున్నాడు రామశేషారెడ్డి. మెల్లమెల్లగా తన మనసులో వున్న ఇంటిరూపం ఇప్పుడు బయటపడ్తుంటే ఎంతో సంతోషంగా ఉంది రామశేషారెడ్డికి.

శేషారెడ్డి కోటలాంటి ఇల్లు కడుతున్నాడని చుట్టుపక్కల ఊళ్ళకి పాకిపోడంతో జనం వచ్చి చూసి వెళుతున్నారు. మేస్త్రి త్రిమూర్తులు పనితనాన్నీ తెగ పొగుడుతున్నారు. రెడ్డిగారి స్నేహితులు, బంధువులు ''ఇలా కోటలాంటి ఇల్లు కట్టడం నీ ఒక్కడికే సాధ్యమయింది. మా దగ్గర డబ్బు మూలుగుతుంది. ఏం ప్రయోజనం నీకుమల్లే దమ్ము వుండాలి గందా! కట్టడానికి అసలు నీలా మేమేదీ చెయ్యలేం. నీలా మేమే కాదు ఎవరం ఉండలేం'' అనేసి పొగుడ్తున్నారు. వాళ్ళు అలా పొగుడుతూ వుంటే శేషారెడ్డిగారికి చాలా ఆనందంగా వుంది. అసలు కోస్తే తను కోరుకునేదదే... తనలాగ ఇంకెవ్వరూ ఉండకూడదు.

ఇంటిపనులు పూర్తి కావస్తున్నాయి. గోడలకి రంగులేస్తున్నారు. పెళ్ళి కూతురిలా ముస్తాబవుతుంది ఇల్లు. ఆ రోజు పున్నమి వెన్నెల్లో మెరుస్తూంది రామశేషారెడ్డిగారి ఇంద్రభవనం.

తన చేతులతో రూపుదిద్దుకున్న ఆ ఇంటిని మైమరిచిపోయి మరీ చూస్తున్న మేస్త్రి త్రిమూర్తులు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఎన్నో ఇళ్ళు కట్టాడు కానీ, ఇలాంటి ఇంద్రభవనాన్ని ఎప్పుడూ కట్టలేదు. ఇది నేను చచ్చిపోయేదాకా మర్చిపోలేని గొప్ప సంగతిది అనుకున్నాడు. కొత్తింటి గోడకి చెంపని ఆనించి దాని చల్లదనానికి మైమరిచిపోయేడు. ఆ రాత్రి ఒక్కడే చాలాసేపు వెన్నెల్లో తడుస్తా వుండిపోయేడు.

త్రిమూర్తులకి చుట్టు పక్కల జిల్లాలనుంచి రాజకీయనాయకులు, పెద్ద పెద్ద కోటీశ్వరుల దగ్గర్నించి కబుర్లొస్తున్నాయి. తమకు అలాంటి ఇల్లు కట్టిమ్మని సరాసరి కార్లలోనే వచ్చి అడుగుతున్నారు. ఆదరాబాదరా శేషారెడ్డి దగ్గరకొచ్చి ఆ వార్తలన్నీ చెపుతున్నాడు త్రిమూర్తులు.

ఇళ్ళలో దిగే కార్యక్రమాన్ని మాగొప్పగా జరిపించాడు రామశేషారెడ్డిగారు. ఆరోజు రాత్రి మూడు మేకల్నేసి చేగల్నాడు నించి పళ్ళతో కాచిన చిగురు తెప్పించి మేస్త్రులందరికీ మంచి విందు ఏర్పాటు చేసేడు. అందరూ మత్తు ఎక్కేదాక ఫూటుగా తాగి లొట్టలేస్తూ తిని ఇన్నిరోజులు చేసిన కష్టాన్ని మరిచిపోయారు.

తెల్లవారింది. మేస్త్రి త్రిమూర్తులు గుండెనొప్పితో చచ్చిపోయేడు. అయ్యోపాపం అనుకున్నారు జనం. కానీ ఊళ్ళో వాళ్ళకి తెలియని త్రిమూర్తులు చావు వెనక రహస్యం ఒకటుంది.

అదేంటంటే

తన ఇంద్రభవనం లాంటిది ఇంక ఎవరికీ కట్టకూడదు ఆ త్రిమూర్తులు అన్న స్వార్థంతో రాత్రి త్రిమూర్తులుకి పెట్టిన అన్నంలో రుచిగా ఉండే విషం కలిపేసేడు రామశేషారెడ్డి.

* * *